## క్లుప్తంగా

### పామర్రు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నాగభూషణం

పామర్రు: మండల తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి 10 రోజులు సెలవు పెట్టినందున పెదపారుపూడి మండల తహసీల్దార్ వి.నాగభూషణంను ఇన్‌చార్జిగా నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో సోమవారం నాగభూషణం పామర్రు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ వరకు ఇన్‌చార్జిగా ఉంటానని ,ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. కార్యాలయం ఉద్యోగులు ఇన్‌చార్జి తహసీల్దార్‌కు స్వాగతం పలికారు.

### చంద్రాల పీఏసీఎస్ అధ్యక్షుడిగా శేషుబాబు



గుడ్లవల్లేరు: చంద్రాలలోని వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడిగా దుగ్గిరాల శేషుబాబు పదవీకాలం మరొక ఆరు నెలల పాటు పొడిగించారు. పొడిగింపు ఉత్తర్వులను గుడివాడ సహకార శాఖ డెప్యూటీ డైరెక్టర్ డి.విజయలక్ష్మి చేతుల మీదుగా సోమవారం శేషుబాబు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను వైఎస్సార్ సీపీ నేత నిమ్మగడ్డ కుటుంబరావు, రైతులు అభినందించారు.

### ముగిసిన సప్తమ వార్షికోత్సవాలు

మండవల్లి: ఈ నెల 4 నుంచి స్థానిక కనకదుర్గ ఆలయంలో నిర్వహిస్తున్న సప్తమ వార్షికోత్సవాలు సోమవారం ముగిశాయి. ఆదివారం రాత్రి దుర్గామల్లేశ్వరస్వామి వార్ల కల్యాణం ఆలయ అర్చకులు చాగంటి శ్రీనివాస్ కనుల పండువగా నిర్వహించారు. సోమవారం రాత్రి అమ్మవారికి పుష్పోత్సవం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి

మండవల్లి: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ ఎ.జనార్దనరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఒక అర్జీ వచ్చినట్టు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ అడ్మినిస్టేటివ్ ఆఫీసర్ జె.శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పవల్లి, ఏపీఓ, హౌసింగ్, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీ నేత ప్రసాద్‌కు డీఎన్నార్ పరామర్శ

కైకలూరు: వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బండి ప్రసాద్ సతీమణి భూషమ్మ (46) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. కైకలూరు మండలం గోపవరం గ్రామానికి చెందిన ఆమె కొద్ది నెలలుగా పేగు సంబంధిత వ్యాధితో ఏలూరు, విజయవాడలలో చికిత్స పొందారు. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఆయన కుమారులు వినయ్, శ్యామ్, గ్రామ సర్పంచ్ ఉలిసి వసంతకుమారి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామ ప్రముఖులు భూషమ్మ మృతదేహానికి నివాళులర్పించారు.

### నేడు వినియోగదారుల అవగాహన సదస్సు

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా విశ్వవిద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఆహార, పౌరసరఫరాల వినియోగదారులకు సంబంధించి అవగాహన సదస్సును మంగళవారం నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ రెక్టార్ డి.సూర్యచంద్రరావు సోమవారం తెలిపారు. విశ్వవిద్యాలయంలోని అల్లూరి సీతారామరాజు ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటలకు ఈ సదస్సు జరుగుతుందన్నారు. వైస్ చాన్సలర్ కె.రామ్మోహనరావు అధ్యక్షతన జరిగే ఈ సదస్సులో ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆహార, పౌరసరఫరాల వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి హెచ్.అరుణకుమార్, విశిష్ట అతిథిగా డాక్టర్ పీవీఎస్ మూర్తి పాల్గొంటారన్నారు. వినియోగదారులకు ఉన్న హక్కులపై అవగాహన కల్పిస్తారని సూర్యచంద్రరావు చెప్పారు.



# వరహాపట్నం అభివృద్ధికి కృషి చేస్తా

**ఎమ్మెల్యే డీఎన్నార్**



వరహాపట్నంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

కైకలూరు: వరహాపట్నం గ్రామానికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) హామీ ఇచ్చారు. సర్పంచ్ ఉప్పలపాటి నాగమణి, ఎంపీటీసీ సభ్యుడు పండు గాంధీ ప్రసాద్ ఆధ్వర్యంలో 160వ రోజు సోమవారం ఆయన వరహాపట్నం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. దివ్యాంగుడైన గ్రామ వలంటీరు మేకా నాగరాజు సేవలకు మెచ్చి అతనిని సన్మానించారు.

**అభివృద్ధిని గాలికొదిలేసిన గత పాలకులు**

గత పాలకులు గ్రామాల అభివృద్ధిని గాలికి వదిలేశారని, వరహాపట్నం గ్రామానికి చెందిన నాయకుడు టీడీపీ పాలనలో రాష్ట్రంలోనే కీలకంగా వ్యవహరించారని, అయినా గ్రామాన్ని మాత్రం పట్టించుకోలేదని ఎమ్మెల్యే డీఎన్నార్ విమర్శించారు. గ్రామంలో ఎక్కడ చూసినా మురికిగుంటలు, దిబ్బలు దర్శనమిస్తున్నాయన్నారు. ఇక్కడ గ్రామ ప్రజలకు గౌరవమో, లేక భయంతోనే గత పాలకులను ప్రశ్నించలేదన్నారు. మంచి చేసే నాయకులనే నేటి ప్రజలు ఆదరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచుల సంఘ మండలాధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు చవల రజనీకాంత్, ఏఎంసీ డైరెక్టరు కోనాల అనిత, ఉపసర్పంచ్ గంగుల ఆంజనేయులు, ఆర్బీకే చైర్మన్ కత్తుల రమేష్, నాయకులు ఉప్పలపాటి జయదేవ్, బోయిన శ్రీనివాసరావు, ఈదా శ్రీను, అందుగుల యాకోబు, గొర్ల నాగేంద్రబాబు, కోనాల జోషి, గోట్రూ పాట్రిక్‌పాల్, ఈదా లక్ష్మణ్, బొమ్మనబోయిన గోకర్ణయాదవ్, ముంగర గోపాలకృష్ణ, గంగుల అశోక్, మాగంటి సూర్యనారాయణ, కూనవరపు సతీష్, నిమ్మల సాయి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మాది ఉద్యోగుల అనుకూల ప్రభుత్వం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడటౌన్: ఉద్యోగుల సంక్షేమాన్ని కోరుకునేది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. స్థానిక రాజేంద్రనగర్ లోని తన నివాసంలో సోమవారం గుడివాడ డివిజన్ వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ క్యాలెండర్, డైరీలను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా విద్యుత్ శాఖలో ఉన్న ఉద్యోగుల సమస్యలను యూనియన్ నాయకులు ఆయన దృష్టికి తేగా అందుకు సానుకూలంగా స్పందిస్తూ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అన్ని సమస్యలకు సానుకూలంగా స్పందించే నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, గుడివాడ డివిజన్ కార్యదర్శి విన్సెంట్, అధ్యక్షుడు సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ సీతయ్య, నాయకులు ఫణీంద్ర, గౌతమ్, ఎల్లారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంపటి సైమన్, పామర్రు లైన్ ఇన్‌స్పెక్టర్ బుచ్చిబాబు, జిల్లా ట్రెజరర్ సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పామర్రు పాలిటెక్నిక్ విద్యార్థికి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పామర్రు: విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడలలో తమ కళాశాల విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబర్చి ద్వితీయస్థానం సాధించారని స్థానిక టీకేఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ తమ్మా భాస్కరరెడ్డి అన్నారు. స్థానిక కళాశాలలో సోమవారం విద్యార్థి అరిక సంజీవ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈనెల 1,2,3 తేదీలలో విజయవాడలో జరిగిన జావలిన్ త్రో రాష్ట్ర స్థాయి పోటీలలో తమ కళాశాల విద్యార్థి సంజీవ్ ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించారని అన్నారు. విజేత అయిన విద్యార్థిని ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, కళాశాల యాజమాన్యం అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలను సాధించాలని ఆకాంక్షించారు.

## వైఎస్సార్ జలకళ పథకం రైతులకు వరప్రసాదం

కురుమద్దాలి(పామర్రు): వైఎస్సార్ జలకళ పథకాన్ని సన్న, చిన్నకారు రైతులు సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని కురుమద్దాలి గ్రామంలో జలకళ పథకంలో మంజూరైన నాలుగు బోర్ల పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులు కూడా తమ పొలాలలో బోర్లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం చక్కటి అవకాశం కల్పించిందని అన్నారు. వీటి ద్వారా సాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. ప్రతి రైతు నీటి సమస్యను అధిగమించాలనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జలకళ పథకం ద్వారా బోర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో కురుమద్దాలి గ్రామంలో నాలుగు బోర్లు మంజూరయ్యాయని చెప్పారు. ఒక్కొక్క బోరుకు రూ.2,72,536 చొప్పున నాలుగు బోర్లకు రూ.10,90,144 మంజూరయ్యాయని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి రైతు తన పొలంలో బోరు ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. అర ఎకరం ఉన్న రైతు ఈ బోరు ఏర్పాటుకు చుట్టుపక్కల వారితో కలిసి దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందించే ఈ జలకళ కార్యక్రమంలో ప్రతి ఒక్క రైతు దరఖాస్తు చేసుకోవచ్చునని అన్నారు. రైతులు వారి వారి గ్రామ సచివాలయాలలో దరఖాస్తు చేసుకుంటే మార్చి నెలలో మంజూరవుతాయని తెలిపారు. ప్రభుత్వం ఇస్తున్న ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోట్రు విజయభారతి, ఫీల్డు అసిస్టెంట్ మేరీ, టీఏ సుస్మిత, రైతులు పాల్గొన్నారు.

## గుడివాడలో బ్లడ్‌బ్యాంక్ సీజ్



బ్లడ్‌బ్యాంక్‌ను సీజ్ చేసిన అధికారులు

గుడివాడటౌన్: లైసెన్స్ గడువు ముగియడంతో పట్టణంలో ఒక బ్లడ్ బ్యాంక్‌ను సోమవారం సీజ్ చేసినట్లు గుడివాడ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ జె.బాలు తెలిపారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని ఎంఎస్ఆర్ బ్లడ్ బ్యాంక్‌కు ప్రభుత్వం ఇచ్చిన లైసెన్స్ జనవరి 30తో ముగిసిందన్నారు. అప్పటి నిర్వాహకులు బ్లడ్‌బ్యాంక్‌ను ఇతరులకు అప్పగించి తప్పుకున్నట్లు సమాచారం అందిందన్నారు. దీనిని తీసుకున్నవారు లైసెన్స్ రెన్యూవల్ చేయించకుండానే బ్లడ్ శాంపిల్స్ తియ్యడం, రక్తం సేకరించడం, అమ్మడం చేస్తున్నారని దీనిని సీజ్ చేసి పరికరాలన్నీ స్వాధీనపర్చుకున్నామని తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాటిలో రక్తంతో నిండిన బ్యాగులు ఏడు, ఖాళీ బ్యాగులు మూడు, సుమారు రూ.7 లక్షల విలువ గల మిషనరీ, ల్యాబ్ సామగ్రి ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మచిలీపట్నం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ ఎం.అరుణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం



విద్యార్థుల నుంచి పాఠశాల వివరాలను అడిగి తెలుసుకుంటున్న జెడ్పీటీసీ వెంకట రమణకుమారి

పామర్రు(పమిడిముక్కల): విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని జెడ్పీటీసీ సభ్యురాలు, విద్యా, వైద్య స్టాండింగ్ కమిటీ సభ్యురాలు ఏనుగ వెంకట రమణకుమారి అన్నారు. పమిడిముక్కల మండలం మేడూరు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌ను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. హైస్కూల్ లోని తరగతి గదులను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ మధ్యాహ్న భోజనాన్ని ప్రతి రోజూ ఇదే నాణ్యతా ప్రమాణాలతో నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం పలురకాలైన ప్రోత్సాహకాలను అందిస్తోందని అన్నారు. వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని అన్నారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, దుస్తులు, ఉపకార వేతనాలు తదితరాలను అందిస్తోందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లుల ఖాతాలలో అమ్మ ఒడి పథకం ద్వారా నగదు జమ చేస్తారని అన్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు ఏనుగ మస్తాన్‌రావు, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, పాఠశాల హెచ్‌ఎం జి.రోజ్ మేరీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మినుముకు తెగుళ్ల బెడద



దాకరంలో మినుము పైరును పరిశీలిస్తున్న అధికారులు

ముదినేపల్లి రూరల్: మినుము పైరుకు మారుకమచ్చలు, కాండం ఎండు తెగుళ్లు ఆశిస్తున్నాయని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఫణికుమార్ అన్నారు. ముదినేపల్లి మండలం దాకరంలో ఫణికుమార్‌తో పాటు మండవల్లి సబ్ డివిజన్ ఏడీఏ జి.వెంకటమణి, మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్, రైతులతో కలిసి మినుము పైరును సోమవారం ఆయన పరిశీలించారు. డివిజన్‌లో మినుము పైరు పూత, పిందె దశలో ఉందని, పలు గ్రామాల్లో మారుకమచ్చల పురుగు తదితర తెగుళ్లు సోకుతోందని తెలిపారు. వీటిని వ్యవసాయాధికారుల సూచనలతో మందులు వాడి సకాలంలో నివారించాలన్నారు. విచ్చలవిడిగా మందులు వాడడం వృథా వ్యయం మినహా పైరుసాగు లాభసాటి కాదన్నారు. గ్రామంలో పలు పైర్లను పరిశీలించగా కాండం ఎండు తెగులు ఉన్నట్టు గుర్తించామన్నారు. దీని నివారణకు ఎకరానికి 250 మిల్లీలీటర్ల హెక్సాకొనజోల్ అనే మందును పిచికారీ చేయాలని సూచించారు. అధికారుల వెంట వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

**చౌడు భూముల్లో ఎదగని మినుము పైరు**

మండవల్లి: మండలంలోని పెరికెగూడెం గ్రామంలో జాతీయ ఆహార భద్రతా మిషన్ (ఎన్ఎఫ్ఎస్ఎం) మినుము సముదాయ ప్రదర్శన క్షేత్రాన్ని సోమవారం డాట్ టీసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఫణికుమార్, సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి, మండల వ్యవసాయాధికారి షేక్ జరీనా పరిశీలించారు. చౌడు భూముల్లో మినుము పైరు పెరుగుదల లోపించిందని, ఆకు అంచులు పైకి ముడుచుకుని ఉండటం గమనించామన్నారు. దీని నివారణకు పొటాషియం నైట్రేట్ లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున ఎకరానికి, కేజీ చొప్పున వారానికి రెండు, మూడు సార్లు పిచికారీ చేయాలని సూచించారు. మినుము పైరులో అక్కడక్కడా లింగాకర్షక బుట్టలు పెట్టాలన్నారు. వేప నూనె కూడా పిచికారీ చేయాలన్నారు. ఈ విధంగా చేయడం వల్ల పంటను నష్టపరిచే పురుగుల ఉధృతిని కొంతవరకు అరికట్టవచ్చని అన్నారు.

## వాహన లైసెన్సులు తప్పనిసరి

కై కలూరు(కలిదిండి): వాహనదారులంతా లైసెన్సులు కలిగి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కలిదిండి ఎస్ఐ మణికుమార్ సూచించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం ఏర్పాటుచేసిన కలిదిండి మండల లైవ్ ఫిష్ మినీ ట్రాన్స్‌పోర్టు ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ మొదటి సమావేశంలో ఎస్ఐ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. లైసెన్సులు పొందడానికి పోలీసుశాఖ సాయం చేస్తోందని, అతివేగంగా వెళ్లకుండా రహదారి భద్రతా సూచనలు తప్పక పాటించాలని డ్రైవర్లకు సూచించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు దండుబోయిన నాగరాజు, ఉపాధ్యక్షుడు పడమటి వెంకన్న, కార్యదర్శి మిద్దె వెంకన్న, ట్రెజరర్ కట్టా ఏసుబాబు, గ్రామ ప్రముఖుడు మసిముక్కు కోటేశ్వరరావు, డ్రైవర్లు పాల్గొన్నారు.

## ‘నూతన జాబ్‌చార్ట్‌ను స్వాగతిస్తున్నాం’

అవనిగడ్డ: జీవో నంబర్ – 2 ద్వారా ఇటీవల పంచాయతీ కార్యదర్శులకు జారీ చేసిన నూతన జాబ్ చార్ట్‌ను స్వాగతిస్తున్నట్లు ఏపీ పంచాయతీ కార్యదర్శుల ఐక్యవేదిక కన్వీనర్ ఆది అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పంచాయతీకి ఒక సెక్రటరీ కేటాయింపు కోసం ప్రభుత్వం ఇప్పటికే ప్రక్రియను ప్రారంభించిందన్నారు. గ్రేడ్ – 5 పంచాయతీ కార్యదర్శులకు అధికారాల బదలాయింపు, డీడీఓలకు అధికారాలు కల్పించడం వల్ల గ్రామ సచివాలయ వ్యవస్థలో మరింత పారదర్శకమైన, పాలన అందుబాటులోకి వస్తుందన్నారు. ఇటువంటి సంచలన నిర్ణయాలు తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## జగనన్న కాలనీ పనులకు ఆటంకం కల్గిస్తే చర్యలు



స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు అర్జీని సమర్పిస్తున్న కార్యకర్త జంపాన శ్రీనివాస గౌడ్

పామర్రు(పమిడిముక్కల): పమిడిముక్కల మండలం గురజాడ గ్రామంలోని జగనన్న కాలనీలో లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం కోసం ఇనుము, సిమెంట్ కావాలని గత రెండు నెలలుగా హౌసింగ్ ఏఈని కోరుతున్నా స్పందించడం లేదంటూ సోమవారం సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస గౌడ్ స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాకు అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాడ గ్రామంలో జగనన్న గృహాల నిర్మాణం కోసం సిమెంట్, ఇనుము కావాలని కోరినా ఇవ్వకుండా తాత్సారం చేస్తున్న హౌసింగ్ ఏఈ బిక్షంపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై తగు చర్యలు తీసుకుని గృహనిర్మాణ లబ్ధిదారులకు సిమెంట్, ఇసుక అందించేలా చూస్తామని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ తెలిపారని చెప్పారు.

## క్రికెట్ పోటీల్లో ఏఎన్నార్ విద్యార్థుల ప్రతిభ



విజేతలైన ఏఎన్నార్ క్రికెట్ జట్టు సభ్యులతో కళాశాల యాజమాన్యం

గుడివాడటౌన్: కృష్ణా యూనివర్సిటీ నిర్వహిస్తున్న అంతర్ కళాశాలల ఈస్ట్ జోన్ క్రికెట్ పోటీల్లో తమ కళాశాల జట్టు విజేతగా నిలిచిందని ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు మచిలీపట్నం లోని కృష్ణా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఏజే కళాశాల మైదానంలో జరిగిన ఈ పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారన్నారు. 12 కళాశాలలు పాల్గొన్న ఈ పోటీలో ఏఎన్నార్ జట్టు కెప్టెన్ నాగవరుణ్ సాయి ఆధ్వర్యంలో జట్టు అద్భుతమైన ప్రదర్శన చేసి విజేతగా నిలిచినట్లు పేర్కొన్నారు. జట్టు సభ్యులను కళాశాల కరస్పాండెంట్ కాట్రగడ్డ సింహాద్రి అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, పీడీ వీర్ల గోపి, అధ్యాపకులు అభినందించారు.

## హైస్కూల్ విద్యార్థులకు సాంకేతిక విద్య



కోరుకొల్లు హైస్కూల్‌లో వర్క్‌షాపు నిర్వహిస్తున్న ఐడియా ల్యాబ్ సిబ్బంది

కై కలూరు(కలిదిండి): అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) నిర్వహణలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందిస్తున్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కాలేజీ ఐడియా ల్యాబ్, కోరుకొల్లు జెడ్పీ హెచ్ఎస్ స్కూల్ ఒప్పందంలో భాగంగా కోరుకొల్లు స్కూల్‌లో 40 మంది 8, 9 తరగతుల విద్యార్థులకు ఐడియా ల్యాబ్ సిబ్బంది సోమవారం ఒక రోజు ఐటీ వర్క్‌షాప్ నిర్వహించారు. వివిధ ఇంజినీరింగ్ కోర్సుల్లో ల్యాబ్‌ల పనితీరును వివరించారు. ల్యాబ్ కోఆర్డినేటర్ ఎస్.గోపాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో చంటి, ధీరజ్, రామ్‌కుమార్ శిక్షణ ఇచ్చారు. హెచ్‌ఎం అడపా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సాంకేతిక విద్యపై అవగాహన కల్పించేందుకు ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కాలేజీ ఐడియా ల్యాబ్‌కు ఇటీవల ఇక్కడ విద్యార్థులను తీసుకువెళ్లినట్టు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నారని, విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండటానికి సాంకేతిక విద్యపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

## కేడీసీసీబీ సేవలపై కళాజాత



వింజరం గ్రామంలో కళాజాత ప్రదర్శన

కైకలూరు: కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ (కేడీసీసీ) ప్రజలకు అందిస్తోన్న సేవలపై వింజరం గ్రామ పంచాయతీ వద్ద బిళ్లపాడు కళాజాత కళాకారులు సోమవారం ప్రదర్శించిన నృత్య రూపకం పలువురిని ఆకట్టుకుంది. వ్యవసాయ రుణాలు, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా, సురక్ష బీమా యోజన, నగదు రహిత లావాదేవీలు, సైబర్ నేరాలపై మాట్లాడారు. వింజరం పీఏసీఎస్ అధ్యక్షుడు సోబుల సత్యనారాయణ, సెక్రటరీ జి.శ్రీనివాసరావు, బ్యాంకు మేనేజరు పీఎస్ రాజు, సూపర్‌వైజర్ శామ్యూల్, కళాకారులు ఎం.శేఖర్‌బాబు, తిరుపతికుమార్, వి.రమేష్, వై.వీరయ్య పాల్గొన్నారు.

# వి.కొత్తపాలెంలో దుండగుల దుశ్చర్య



కాలి బూడిదైన నగదు, విలువైన పత్రాలు

కోడూరు: మండల పరిధిలోని వి.కొత్తపాలెం గ్రామంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు దుశ్చర్యకు పాల్పడ్డారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు ఇంటికి పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. గ్రామానికి చెందిన మద్ది నిర్మల ఇటీవల నూతన గృహాన్ని నిర్మించుకొని అందులో నివాసముంటుంది. అయితే నిర్మల ఆదివారం ఉదయం ఇంటికి తాళం వేసి గుంటూరులోని తన కుమార్తె ఇంటికి వెళ్లింది. దీంతో ఇదే అదునుగా భావించిన దుండగులు అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఇంటి ప్రధాన ద్వారంపై పెట్రోల్ పోసి ఇంటికి నిప్పు పెట్టారు. దీంతో మంటలు ఇళ్లంతా వ్యాపించి గృహోపకరణలు, విలువైన వస్తువులు దగ్ధమైయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు మంటలు సమీప ఇళ్లకు వ్యాపించకుండా అదుపు చేసే ప్రయత్నం చేశారు. ప్రమాదంలో రూ.80 వేల నగదు, పొలానికి సంబంధించిన పత్రాలు, విలువైన వస్తువులు దగ్ధమైనట్లు బాధితురాలు తెలిపారు. ప్రమాదంలో రూ.3 లక్షల ఆస్తి నష్టం సంభవించిందన్నారు. అగ్ని ప్రమాద ఘటనపై బాధితురాలు కోడూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

## 10న చెరువు వేలం పాటలు

ముదినేపల్లి రూరల్: పెయ్యేరు శివారు అప్పారావుపేటలో జిల్లా పరిషత్‌కు చెందిన 2.19 ఎకరాల చేపల చెరువు మూడేళ్ల పాటు లీజుకు ఇచ్చేందుకు ఈనెల 10న వేలం నిర్వహిస్తామని ఎంపీడీఓ పి.మల్లీశ్వరి తెలిపారు. అప్పారావుపేట ప్రాథమిక పాఠశాలలో ఉదయం 11 గంటల నుంచి వేలం నిర్వహిస్తారని, పాటలో పాల్గొనేందుకు రూ.10 వేలు డిపాజిట్‌గా చెల్లించాలన్నారు. వివరాలకు పంచాయతీ కార్యదర్శి 73968 13396 లేదా ఎంపీడీఓ 91000 84658 నంబర్లలో సంప్రదించాలని కోరారు.